37.

# ఆనందమే మానవుని స్వస్థానము

**సాధు జనులను చూచి చౌకను చేతురు**
**వారికేమి కొదువ వసుధయందు**
**కుంజరమును జూచి కుక్కలెన్నో మొరుగు**
**దానికేమి కొదువ ధరణియందు**

ఈనాటి కలిప్రభావము చేత యిత్యాది దృశ్యములు ఎన్నియో మనం చూస్తున్నాం. కోకిల గానము చూచి కాకులు ఎంతయో అరుస్తాయి. అంతమాత్రం చేత కాకుల కూతలకు కోకిల గానము మానుకోవటం ఏమాత్రం జరుగదు. హంసలను చూచి కొంగలెంతో పరిహాసముగా కూస్తుంటాయి. కానీ కొంగలెంత పరిహాసము చేసినప్పటికిని హంస ఘనత ఏమాత్రము తగ్గిపోదు. కానీ మానవత్వము యొక్క దివ్యత్వము గుర్తించుకున్న వ్యక్తి తనయొక్క సత్యాన్ని తాను గుర్తించుకున్నప్పుడు యిత్యాది మానాభిమానములకు గానీ, కీర్తి ప్రతిష్ఠలకు గానీ ఏమాత్రం లొంగడు పొంగడు. మానవజన్మ భగవంతుని యొక్క వరప్రసాదము. ఈ వరప్రసాదాన్ని సరైన మార్గములో అనుభవించినప్పుడే ఈ అందుకున్న వ్యక్తి సార్థక నాముడౌతాడు. అందులో భగవంతుడు అందించిన యీ దేహము పవిత్రమైన పాత్ర. ఈ పాత్రను సక్రమమైన మార్గములో సరియైనస్థితిలో వినియోగించుకున్నప్పుడు ఈ పాత్ర ప్రభావము మానవత్వము యొక్క అర్థమును గుర్తిస్తుంది.

**అధమ, మధ్యమ ఉత్తమాధికారులు**

ఇందులో మూడు విధములైన మార్గములు గోచరిస్తున్నాయి. అధముడు, మధ్యముడు, ఉత్తముడు అని మూడు స్థితులుంటున్నాయి. ఈ అందుకున్న మానవదేహమనే పాత్రను సద్వినియోగపరిచి, సరైన మార్గములో దీనిని అనుభవించినప్పుడు వీనిని సరైన రీతిలో ఉత్తముడు అంటారు. కానీ యీ దేహమనే పాత్ర విలువ గుర్తించుకొనలేక దుర్వినియోగపరచి, దుర్మార్గములో ప్రవేశించి దీన్ని అనేక

sri sathyasai vachanamrutam

విధములుగా అపవిత్రము గావించినవాడు అధముడు అంటారు. అయితే ఈ అధమునకు, ఉత్తమునకు, మధ్యనున్న వారు కొన్ని రకములైన మార్గములు అనుసరిస్తున్నారు. భగవంతుని దగ్గరనుండి నిర్మలమైన, నిస్వార్థమైన, పవిత్రమైన, పరిశుద్ధమైన ఈ దేహమును అందుకొని మానవుడు గుర్తించి దీనిని సరైన మార్గము పట్టించి, మరికొన్ని సమయములలో సన్మార్గమును వీడి అపవిత్రత, పవిత్రత రెండింటిని వినియోగించుకొన్న వాడు మధ్యముడు అంటారు. ఈనాటి ఆధునిక యుగమందు మానవుడు నిద్రించే నిమిత్తమై చక్కని మెత్తని పాన్పును తెచ్చుకుంటాడు. దీనికి తగినట్టుగా మెత్తని అనుకూలమైన దిండ్లు అమర్చుకుంటాడు. దీనికి అనుగుణంగా నిరంతరము గాలిని అందించే సీలింగ్ ఫ్యాను తగిలించుకుంటాడు. సీలింగ్ ఫ్యాను తిరుగుతున్నది. Bed మెత్తగా ఉన్నాది. పిల్లో అనుకూలముగా ఉన్నాది. కానీ ఈ వ్యక్తికి నిద్ర రావటం లేదు. ఇలాంటి పరిస్థితి లోపల పాన్పు, దిండ్లు, గాలి యీ మూడింటిని చూచి ఆనందిస్తాడా లేక నిద్రరాలేదని విచారిస్తాడా? ఈ bed, ఈ pillow, ఈ ceiling fan దేని నిమిత్తమై అమర్చుకున్నాడు. సుఖనిద్ర లేనప్పుడు యీ మూడు ఉండి ప్రయోజనము ఏమిటి? ఈ మెత్తని పాన్పు ప్రయోజనం ఏమిటి? ఈ అనుకూలవంతమైన దిండ్లు వేసుకొని ప్రయోజనం ఏమిటి? వీని ఉపయోగము ఏమాత్రము ఉండదు.

**హృదయమే పాన్పు**

అదేవిధముగా మానవుడు ఈ శరీరమనే దానియందు మెత్తని హృదయమనే పరుపువేసుకొని మనస్సు అనే పిల్లోను ధరించి బుద్ధి అనే fan చక్కగా వేసుకున్నప్పటికి ఈ మానవునికి ఏమాత్రం శాంతిసుఖము అనుభూతికి రావటం లేదు. ఈ అనుకూలము యివ్వని ఆనందము యివ్వని శాంతి యివ్వని యీ మనస్సు బుద్ధి హృదయము ప్రయోజనం ఏమిటి? ఈనాటి మానవుని హృదయము నిర్మలము, నిశ్చలము,నిస్వార్థమని వర్ణిస్తున్నారు లేదా వల్లిస్తున్నారు. 'మనోమూలమిదం జగత్తు' అని యీ మనస్సును చాలా వర్ణిస్తున్నారు. 'బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్' బుద్ధి కంటె మించినది లేదని వర్ణిస్తున్నాము. ఇన్ని విధములైన వర్ణనలు చేస్తున్నప్పటికిని మానవునికి సుఖము శాంతి అనేది ఏమాత్రము కనిపించటం లేదు. ఎందుకోసం దీన్ని మనం అనుభవిస్తున్నాము. ఎందుకోసం భగవంతుడు దీన్ని

srisathyasai vahini

అందించాడు. ఈ హృదయ మనోబుద్ధులు అందించటము మనశ్శాంతి నిమిత్తమే. మానవ జీవితము శాంతిభద్రతలకు గురి కానప్పుడు అన్నీ ఉండి ప్రయోజనం ఏమిటి? ఈనాడు మానవుడు ఉత్తముడు అని పేరు పొందుతున్నాడు. 'జంతునాం నరజన్మ దుర్లభం'. ఈ మానవజన్మ చాలా దుర్లభమైనదని వర్ణించుకుంటున్నాం. యిట్టి వర్ణించుటకు తగిన పరికరములు మనం సరియైన మార్గములో వినియోగించుకుంటున్నామా? మనసును సరైన మార్గములో ప్రవేశపెట్టటం లేదు. బుద్ధిని సరైనస్థితిలో విచారించటం లేదు. హృదయాన్ని నిర్మలంగా ఉంచుకోవటం లేదు. కనుక మానవునకు శాంతి అనే నిద్ర అత్యంత దూరమైపోయింది. సుఖము అనేది కంటికి చాలా దూరమై పోయింది. సుఖశాంతులు లేని జీవితము ఒక జీవితమా? ఇందులోనే వైరాగ్యము పొందాలని ప్రార్థిస్తారు గొప్పవారందరు.

## వైరాగ్యమననేమి?

ఈ వైరాగ్యమంటే ఏమిటి? ఆస్థిని, ఆలిని వీడి అడవికేగుట కాదు. ఈ వైరాగ్యమును చక్కగా గుర్తించుకోటానికి విద్యార్థులు సంసిద్ధులుగా ఉండాలి. ఈ స్థూల ప్రపంచము. ఇది జడమైనదని విశ్వసించాలి. సూక్ష్మ ప్రపంచము ఇది మాయా స్వరూపకముగా మనం విశ్వసించాలి. కారణ స్వరూపము ఇది ప్రతిబింబముగా మనం తీసుకోవాలి. ఆవిధముగా మూడింటి అర్థములు మనం చక్కగా గుర్తించినప్పుడే మనకు వైరాగ్యము సహజంగా లభిస్తుంది. కానీ ఈ మానవుడు యీ మూడింటికి విరుద్ధముగా అనుభవిస్తున్నాడు. స్థూల ప్రపంచమే సత్యముగా విశ్వసిస్తున్నాడు. సూక్ష్మమైన ప్రపంచమే సరైన ముక్తిగా భావిస్తున్నాడు. ఇంక కారణ స్వరూపమైన మానసతత్వము వైకుంఠముగా విశ్వసిస్తున్నాడు. స్థూలసూక్ష్మ కారణ స్వరూపములు మానవునకు ఏమాత్రము సంబంధము లేదు. మహా కారణస్వరూపుడైన వాడే భగవంతుడు. ఈ స్థూలమును మనం జడస్వరూపముగా విశ్వసించాలి. ఈ జడములో చైతన్యము ఏమాత్రం లభ్యం కావటం లేదు. ఈ జడమును నమ్ముకొని మనం జీవించే జీవితము ఏమిటి? సూక్ష్మ జీవితము మాయ. లేనిదానినే మాయ అంటారు. కారణ స్వరూపమైనది ప్రతిబింబమే. ఇది బింబము కాదు. బింబము కానప్పుడు దీన్ని ఎందుకు బింబముగా విశ్వసించాలి. కనుక మానవత్వములోని వైరాగ్యము యీ

sri sathyasai vaharamrutam

మూడింటిని చక్కగా అర్థము చేసుకోవటంచే నిజమైన వైరాగ్యము ప్రాప్తిస్తుంది. ఈనాటి మానవుడు ఆవిధమైన భావములు ఏమాత్రము అనుభవించటం లేదు. ఈ స్థూల, సూక్ష్మ స్వరూపమైన మాయ స్వరూపమైన జగత్తు, మనస్సు భ్రమింప చేసేవే. మహాకారణమైన ఆత్మతత్వానికి మనం ప్రవేశించాలి. అప్పుడే ఆనందము, శాంతి మనకు లభ్యమవుతుంది. కనుక మానవత్వాన్ని యీనాడు చక్కగా అర్థము చేసుకోవటానికి తగిన ప్రయత్నం చేయాలి. ఈనాడు మానవత్వం అంటే ఏమిటో అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉంటున్నారు.

### నరుడనగా ఆత్మస్వరూపుడే

వీడు నరుడు. నర అనగా అర్థము ఏమిటి? ఆత్మకే నర అని పేరు. నర అనగా ఆత్మస్వరూపుడే. ఈ ఆత్మకు మూలస్థానము ఆకాశము. ఈ ఆకాశము యొక్క ప్రతిబింబములే యీ పంచభూతములు. దీనినే ఒకానొక సమయంలో గోపికలు **"క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయస్వాహా"** అని క్రిష్ణుని కీర్తిస్తూ వచ్చారు. అంటే ఏమిటి క్లీం అనేదే భూమి. కృష్ణాయ – జలము, గోవిందాయ – అగ్ని, గోపీజన వల్లభాయ వాయువు, స్వాహా–ఆకాశము. ఈ పంచభూతముల స్వరూపమే యీ మానవత్వములో చేరి ఉన్నది. పంచభూతములులేని స్థలముగానీ, పంచభూతములులేని జీవితముగానీ జగత్తులో కానరాదు. పృద్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము సర్వత్రా వ్యాపించినవి యీ పంచభూతములు. దీనిలో భగవంతుడు సర్వత్రా వ్యాపించిన వాడని వారు నిర్ణయము చేసుకున్నారు. ఇలాంటి సర్వవ్యాపకుడైనవాడు, సర్వజ్ఞుడైనవాడు, సర్వశక్తిమయుడు భగవంతుడు. ఈ పంచభూతములను సద్వినియోగపరచుకోవటమే మానవుని ప్రధాన కర్తవ్యము. అగ్ని – దీపములు ఉంటున్నాయి. వానిని దుర్వినియోగపరచుకుంటున్నారు యీనాటి మానవులు. అగ్నిని దుర్వినియోగం చేసుకోవటమే భగవంతుని దుర్వినియోగం చేసుకోవటం. జలమును దుర్వినియోగం చేసుకోటమే భగవంతుని దుర్వినియోగం చేసుకోవటం. పృధ్విని కూడా దుర్వినియోగం చేసుకుంటున్నాం. అదియే భగవంతుని దుర్వినియోగం చేసుకోవటం. ఆకాశము – ఈ ఆకాశము అన్నింటికి మూలాధారమైనది. ఈ మూలాధారమైన ఆకాశతత్వాన్ని మనము ఏమాత్రము విశ్వసించటం లేదు. మానవుడు పంచభూతములతో కూడిన యీ పాంచభౌతిక దేహమునే విశ్వసించి దీని సుఖములకోసం,

srisathyasaivachanamrutam

దీని ఆనందముల కోసం, దీని అనుకూలముల కోసం జీవితాన్ని అర్పితము చేస్తున్నాడు.

**దేహమొక పనిముట్టు**

**పాంచభౌతికము దుర్భలమైన కాయము**
**ఎప్పుడో విడిచేది ఎరుక లేదు**
**శతవర్షముల దాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినోఉదక మధ్యంబునో**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**

ఇలాంటి water bubble వంటి ఈ దేహాన్ని గురించి యింత ప్రయత్నం యింత శ్రమలు ఎందుకు పడాలి. బతికినందుకు ఒక సార్థకమైన కర్మ ఆచరించాలి. ఆదర్శమైన జీవితమును అనుభవించాలి. శాంతిసుఖములను మనం అందించాలి. సర్వమునకు దేహమే మూలకారణము. ఈ దేహాన్ని ఒక పనిముట్టుగా తీసుకొని తద్వారా మనము శాంతి సంతోషములను అనుభవించాలి. ఇది కేవలము ఒక పనిముట్టు మాత్రమే గానీ, ప్రాణ సమానమైనది కాదు. ఇప్పుడు ఒక్క fan పెట్టుకున్నాం. Fan తిరుగుతున్నాది. దానివల్ల గాలి వస్తున్నాది. ఈ గాలి ఎక్కడ నుండి వస్తున్నాది. Fan నుంచి వస్తున్నాదా కాదుకాదు. సర్వత్రా ఉన్నది గాలి. ఆ fan మనవైపుకు తిరిగినప్పుడు ఈ గాలి అనుభవిస్తున్నాము. నీ మనస్సు అనే fan భగవంతునివైపు తిప్పు. నీకు ఆనందమనే గాలి లభ్యమవుతుంది. కానీ mind అనే fan ప్రకృతి వైపు తిప్పిగాలి రాలేదనుకుంటే ఎవరిది తప్పు. నీ మనస్సును భగవంతునివైపు మరల్చాలిగానీ పాంచభౌతికమైన దేహమువైపు మరల్చకూడదు. యిలాంటి అనిత్యము, అశాశ్వతమైన దేహతత్వాన్ని మనం నిత్యసత్యంగా విశ్వసిస్తున్నాము. దీని ఆనంద నిమిత్తమై అనేక పాట్లు పడుతున్నాము. దీని సుఖసంతోషముల నిమిత్తమై అనేక క్రియలు చేస్తున్నాం. కానీ యివన్నీ వ్యర్థమైన పనులే.



srisathyasaivachanamrutam

## హృదయము దేహముకాదు

మన హృదయానికి సంబంధించిన మార్గము వెతకాలి. హృదయము ఎప్పుడు ఆనందమయమైనదే. ఎప్పుడు పరమప్రీతితో కూడినదే. శాంతితో చేరినదే. శాంతి బయట ప్రదేశములో లేదు హృదయమునందే శాంతి ఉన్నది. కానీ ఆ శాంతిని కూడా అశాంతిగా మార్చుకుంటున్నారు ఈనాటి మానవులు. ఇంక శాంతి ఏవిధంగా మీకు లభిస్తుంది? శాంతి మన హృదయము నుండి ఆవిర్భవించాలి. హృదయము పవిత్రమైన గుణములకు మూలాధారమైనది. దేహము అపవిత్రమైన కామ, క్రోధ, లోభ, మోహ, మద మత్సర్యములతో, అరిషడ్వర్గములతో కూడినది దేహము. దయ, ప్రేమ, సహనము, సానుభూతి, సత్యము యిలాంటి పవిత్రమైన గుణములతో కూడినది హృదయము. ఈ హృదయమునుండి వచ్చేవన్నీ పవిత్రమైనవిగా మనం భావించాలి. ఈ హృదయానికి దేహాన్ని ఏమాత్రము అతికించకూడదు. నీ దేహము ప్రత్యేకమైనది. హృదయమునకు తొడుక్కున్న కవచము వంటిది దేహము. కానీ మానవత్వమును యీనాడు అర్థము చేసుకోటం కష్టమైపోవటంచేత అనర్థముల చేత మానవుడు జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాడు. ఎంత పవిత్రమైనది మానవజీవితము. ఎంత ధన్యమైనది మానవజీవితం. ఎంత పుణ్యమైనది మానవజీవితం. ఎంత విలువైనది మానవ జీవితం. దీనివిలువ ఏమాత్రం తెలుసుకోవటం లేదు. దీని విలువను గుర్తించటానికి ప్రయత్నించాలి. మనస్సు బుద్ధి చిత్తము ఇంద్రియములు యివన్నీ దేహము యొక్క ఉపాధులు. ఈ ఉపాధుల యొక్క తత్వాన్నే మనం గుర్తించుకుంటున్నాం కానీ ఆత్మతత్వమును ఏమాత్రం ప్రయత్నించటం లేదు. దీనికి మూలాధారమైన ఆత్మతత్వాన్ని మనం గుర్తించాలి. ఈ ఆత్మతత్వాన్ని గుర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. సార్థకత పొందటానికి అనేక రకములైన సాధనలు చేస్తున్నాం. ఈ సాధనలు చేసి ఏమి ప్రయోజనం లేదు. హృదయాన్ని పవిత్రమైన భావముతో నింపి, విశ్వాసముతో, ఏపని అయినా చేయి అన్నీ పవిత్రమవుతాయి. హృదయాన్ని అపవిత్రము గావించుకొని ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనము ఉండదు. అన్నీ కూడా నిరర్థకమైన పనులుగా ఉంటాయి. నీవు హృదయాన్ని మొట్టమొదట పవిత్రం గావించుకో. ఈ దుర్మార్గ భావములు హృదయంలో చేరకుండా చూచుకో. మానవునకు



sri sathyasai vahini amrutam

కామ, క్రోధ, లోభములు యీమూడు ఆధ్యాత్మికానికి పరమశత్రువులు.

**కామ, క్రోధ, లోభాలే పతన కారణాలు**

రామాయణములో రావణుడు ఎంత గొప్పవాడు. ధన కనక వస్తు వాహనాదులలో తక్కువలేదు. విద్యలో 64 విద్యలు చదివినవాడు. ఇంక అనేక తపస్సులాచరించి దైవానుగ్రహము పొందినవాడు. ఇంత గొప్ప వ్యక్తి ఒక్క కామానికి లోనుకావటం చేత సర్వము పతనము గావించుకున్నాడు. పవిత్రమైన, దివ్యమైన, భవ్యమైన రామాయణమందు రావణుడు ఒక పెద్ద మూర్ఖుడుగా రూపొందింపబడ్డాడు. కారణము యీ వాంఛలే. ఈ వాంఛల చేతనే తన తపఃఫలము నాశనము చేసుకున్నాడు.

ఇంక భాగవతములో హిరణ్యకశిపుడు – హిరణ్యకశిపుని క్రోధము – హిరణ్యకశిపుడు పంచభూతములను అదుపులో పెట్టుకున్నవాడు. హిరణ్య కశిపుడు గొప్ప సైంటిస్టు. భూమిని కూడా తిరగకుండా చేయాలని ప్రయత్నం చేశాడు. ఈనాటి సైంటిస్టులు చంద్రమండలానికి పోయారు. హిరణ్యకశిపుడు సూర్యమండలానికే ప్రయాణం చేశాడు. ఇంత గొప్ప సైంటిస్టు అయి కూడను క్రోధము వలన ఏమాత్రం సాధించలేదు. కోపము కల్గినవానికి ఏమి ఫలిస్తుంది.

**కోపము కలిగిన వానికి**
**ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్**
**పాపపు పనులను చేయుచు**
**ఛీ పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ**
**తన కలిమి భంగపుచ్చును**
**తనకుంగల గౌరవంబు దగ్దము చేయున్**
**తన వారలకెడ సేయును**
**జనులగు కోపము వలన సర్వము చెడున్**

ఈ భాగవతములో హిరణ్యకశిపుడు క్రోధమనే స్వరూపము దరించాడు. యింక భారతము

sri sathyasai vachanamrutam

నందు దుర్యోధనుడు లోభి.

**లోభి వానిని చంప లోకంబు లోపల**
**కొట్ట వద్దు వాని తిట్టవద్దు**
**డబ్బునడిగినంత డబ్బున చచ్చు.**

అంత లోభి. ఇలాంటి లోభియైన దుర్యోధనుడు ఏమి సాధించాడు? ఇలాంటి క్రోధముతోనున్న హిరణ్యకశిపుడు ఏమి సాధించాడు? రావణుడు గొప్ప భక్తుడే. గొప్ప తపః సంపన్నుడే కానీ ఈ కామము చేత ఏమి సాధించాడు? కనుక కామ క్రోధ లోభములు మూడు పరమ శత్రువులు సాధకునకు. ఎన్ని సంవత్సరములు సాధన చేసినా ఒక్కసారి కోపం వచ్చిందా సర్వము నాశనమైపోతుంది. ఈ మూడింటిని మనం అదుపులో పెట్టుకోవాలి.

**హృదయాన్ని విశ్వసించాలి**

లోకములో ఒక పదిమంది దుర్మార్గులుంటుంటారు. ఈ పదిమంది దుర్మార్గులలో ఏ ఒక్కడైనా కొంచెం సన్మార్గుడుగా ఉంటాడు. ఈ పదిమంది సన్మార్గులలో ఏ ఒక్కడైనా దైవప్రీతిగలవాడు ఉంటాడు. ఈ పదిమంది దైవప్రీతి గలవారిలో ఒక్కడైనా దైవాన్ని పొందాలనే అభీష్టము కలిగినవాడు ఉంటాడు. ఈ దైవాభీష్టము కలిగిన పదిమంది లోపల ఒక్కడైనా దైవాజ్ఞ శిరసావహించాలని భావిస్తాడు. **దైవాజ్ఞ శిరసావహించి ప్రవర్తించినవాడే ధన్యుడు** అన్నారు. ఆజ్ఞను శిరసావహించక ఎన్ని సాధనలు చేసి ప్రయోజనం ఏమిటి? కనుక మొట్టమొదట దుర్మార్గములోనున్న సన్మార్గమును గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రతి మానవునియందు పవిత్రమైన మంచితనము ఉన్నాది. కానీ మానవుడు యిది మంచితనంగా భావించుకోటం లేదు. తన అభీష్టమునకు విరుద్ధమైనదిగా విశ్వసిస్తున్నాడు. ఈనాటి మానవునకు శరీర సుఖము, మానసిక శాంతి రెండే చాలా అవసరము. ఏమిటి ఈ రెండింటివలన లభించే ఫలితము. నీ హృదయాన్ని విశ్వసించు. ఈ తుచ్ఛమైన మనస్సును, అనిత్యమైన దేహాన్ని నీవు ఎందుకు విశ్వసిస్తావు? నీ హృదయాన్ని విశ్వసించిన తరువాత తోడుగా యివన్నీ విశ్వసించవచ్చు. ఎంతకాలమైనా యింకా సుఖము యింకా సుఖము ఉండాలి. ఈ సుఖము అంటే ఏమిటో నాకు అర్థము కావటం లేదు.

srisathyasaivachanamrutam

## సుఖమంటే వాంఛారాహిత్యమే

ఏమిటి సుఖమంటే. వాంఛలు లేకపోవటమే సుఖము. వాంఛలు ఉండటమే దుఃఖము. సమస్త వాంఛలకు దుఃఖమే మూలకారణము. యివన్నీ దుఃఖమునుండే ఆవిర్భవిస్తున్నాయి. నేను గొప్ప ప్రైమినిస్టరు కావాలి, chief minister కావాలి యివన్నీ దుఃఖానికి హేతువే. నిజంగా ఈ కోరికలు సుఖాన్ని అందించేవి కాదు. ఎవరి దగ్గరకైనా పోయి మీరు ప్రశ్నించండి. గొప్ప శ్రీమంతుడుగా ఉంటాడు. ధనమునకు ఏమీ తక్కువలేదు. ధాన్యమునకు ఏమీ తక్కువ లేదు. భవనములకు ఏమీ తక్కువ లేదు. సంచారమునకు ఏమీ తక్కువ లేదు. సర్వ అనుకూలములు ఉన్నాయి. 'అయ్యా మీరెంత అదృష్టవంతులని' ప్రశ్నిస్తే నేను అదృష్టవంతుడని ఎట్లా తెలుసు నీకు అంటాడు. ధనకనక వస్తు వాహనాదులకు తక్కువ లేదు. కావలసినన్ని సదుపాయాలు ఉన్నాయి. కావలసినంతమంది నౌకర్లు ఉన్నారు. కావలసినంత భోజనం చేయవచ్చు. యింతకంటే ఏమి కావాలండీ అదృష్టానికి అన్నాడు. అప్పుడా శ్రీమంతుడు చెబుతున్నాడు. మీరు చెప్పినట్టు అన్ని అనుకూలములుంటున్నాయి. ప్రయోజనం ఏమిటి? రెండు మాత్రం నా దగ్గర లేవు అన్నాడు. ఏమిటవి? శాంతి, సుఖము రెండూ లేవు. ఈ పదార్థములన్నీ నాకు comfort ను అందిస్తున్నాయి గానీ సుఖాన్ని అందించటం లేదు. ధనము ఉన్నాది. ధనము, కీర్తి సంపాయిస్తున్నాది గాని గౌరవము సంపాదించటం లేదు. ఈ నౌకర్లంతా కావలసినంతమంది ఉన్నారు. కానీ వీరంతా service గా చేస్తున్నారే గానీ స్నేహంగా చేయటం లేదు. స్నేహితుడు లేనప్పుడు యింతమంది సర్వెంట్సు ఉండి ప్రయోజనం ఏమిటి? నీ స్నేహితుడు ఎవరు? సర్వకాల సర్వావస్థలయందు కూడనూ వెంటనే జంటనే యింటనే ఉండి కాపాడే స్నేహితుడు భగవంతుడొక్కడే. ఆనాటి నుండి శ్రీమంతుడు ప్రార్థిస్తూ వచ్చాడు. ఓ భగవంతుడా ఈ ప్రపంచమే పెద్ద గ్రంథము. నా యొక్క బుద్ధియే గురువు. భగవంతుడు నా స్నేహితుడు. దీనిని భద్రముగా ఉంచుకుంటే నాకు ఏ సుఖమునకు అడ్డు లేదు. ఈనాడు అందరు స్నేహితులుగానే తయారౌతున్నారు. చెరువులో నీరు ఉండినంతవరకు వేలకు వేలు కప్పలు వచ్చి చేరిపోతుంటాయి. కానీ నీరు ఎండిపోతూనే ఒక్క కప్ప కూడా అక్కడ ఉండదు. అదేరీతిగా నీవు శ్రీమంతుడుగా

srisathyasaivahini.org

ఉండినంతవరకు, అధికారిగా ఉండినంతవరకు, నీవు గొప్ప పదవిలో ఉండినంతవరకు అందరూ నీకు స్నేహితులే. నీ ధనము నిర్మూలమాయెనా, పదవి తరగిపోయెనా, ఒక్కరైనా నిన్ను చూచి good bye చెప్పడు. ఇలాంటి ప్రకృతి లోపల యివా మనకు శాశ్వతమైనవి. ఏదీ శాశ్వతము కాదు. మన హృదయములో నున్న ప్రేమతత్త్వమే శాశ్వతము. ఈ ప్రేమచేతనే సర్వులు బంధువులైపోతారు.

**ప్రేమే అందరినీ ఆకర్షిస్తుంది**

ప్రేమను ఒక్కదానిని మనం దగ్గర చేర్చుకుంటే ప్రపంచాన్నంతా దగ్గర చేర్చుకుంటాం. ఈనాడు యిన్ని దేశాలనుండి, యిన్ని ప్రాంతములనుండి యిక్కడకు వీరు ఎందుకోసం వచ్చారు. చక్కగా విచారణ చేసినప్పుడు దీని అంతరార్థము చక్కగా అర్థమవుతుంది. నీ యింటిలో లేనిది, నీ దేశములో లేనిది, నీ సంసారములో లేనిది, నీ రాష్ట్రములో లేనిది, నీ గ్రామములో లేనిది ఏదో ఒక్కటి యిక్కడ ఉన్నాది. అదే సర్వసమానత్వమైన ప్రేమ. ఆ ప్రేమ నిమిత్తమై మీరు యిక్కడకు వచ్చారు. ఆ ప్రేమ మీ యింటిలో లేదు. నీ దేశములో లేదు. నీ గ్రామములో లేదు. ఆ ప్రేమను పొందే నిమిత్తమే నీవు యిక్కడకు వచ్చావు. కనుక ప్రేమచేతనే సన్నిహిత సంబంధ బాంధవ్యము ఏర్పరచుకోవచ్చును. ప్రేమరహిత భూమి మరుభూమి. హృదయమనే భూమియందు ప్రేమతత్త్వము ఉండాలి.

**ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొందా**
**ప్రేమావేశముతో ప్రేమ సుధావర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళీగానము చేయగదే - కృష్ణాగానము చేయగదే**

గోపికలు ప్రార్థించారు. నీ మురళీనాదమునందే యీ ప్రేమతత్త్వము ఉన్నాది. నీ వాక్కునందే ప్రేమతత్త్వము ఉన్నాది. నీ ప్రవర్తన యందే ప్రేమతత్త్వము ఉంటున్నాది. నీ ప్రేమ మరొక దాన్ని ఆశించినది కాదు. దేనిని ఆశించదు యీ ప్రేమ. అందించేదే గాని అందుకొనేది

srisathyasaivachanamrutam

కాదు. అట్టి ప్రేమ ఎక్కడా చిక్కదు. ఒక్క దైవము నందు మాత్రమే అట్టి నిస్వార్థప్రేమ లభ్యమవుతుంది. అట్టి నిస్వార్థ ప్రేమ నిమిత్తమై మీరు యింతవరకు పాటుపడుతూ వస్తున్నారు. లేకపోతే ఎవరు మీకు జాబులు వ్రాసారు, ఎవరు మీకు invitation పంపారు. ఎందుకోసం యిక్కడకు వచ్చారు. నీకు ఏమి నేను యిస్తున్నాను. ఏమీ లేదు. నాయనా ఎప్పుడొస్తివి అని ప్రేమతో మాట్లాడుతే వాడు ఉబ్బిపోతున్నాడు, చాలా ఆనందము అనుభవిస్తున్నాడు. ఒక్క మాటలోనే యింత మాధుర్యము ఉంటున్నాది. కనుక మీరు మధురమైన మాటలు నేర్చుకోండి. పవిత్రమైన ప్రవర్తనలో నడుచుకోండి. అప్పుడు నీకు గౌరవము లభిస్తుంది. మనం మాట్లాడే మాట సత్యమైనదిగా ఉండాలి. You cannot always oblize, but you can speak always oblizingly. అంత మృధుమధురమైన మాటలుగా ఉపయోగించుకో. ఎవరైనా మన యింటికి వచ్చారంటే ఏమండి ఎప్పుడు వచ్చారు? దయచేసి లోపలకు రండి అని మంచిగా మాట్లాడితే, అతనికి భోజనం చేసినంత ఆనందము వస్తుంది. అట్లుకాక బంధువులతో ఎందుకు వచ్చారండి అంటే వానికి మరింత ఆకలైపోయి వెళ్లిపోతారు. కనుక మాటలయందు మాధుర్యము మనం నేర్చుకోవాలి. ఆ మాటలలో మాధుర్యము లేక మాటలు కఠినమైపోతాయి. కఠినమైన మాటలు కేవలం బాంబులవలే అతనిని భస్మం చేస్తాయి. మరి ఏమి పెట్టకపోయినా మృధుమధురమైన మాటలచేత అతనిని శాంత పరచాలి.

**అందరి సుఖమే వాని సుఖం**

**హస్తస్య భూషణం దానం కంఠం సత్యస్య భూషణం**
**శాస్త్రం శోత్రంచ భూషణం**

యింతకంటె మనకు అందము ఏమి కావాలి. యింతకంటె జ్యూయల్సు (Jewels) ఏమి కావాలి. హస్తమునకు దానము భూషణం. కంఠమునకు భూషణం నెక్లెసు కాదు. కంఠము నుంచి మధురమైన సత్యాన్ని పలుకుతే అదే భూషణం. మంచి విషయాలు వినాలి, చెడ్డవి మనం వినకూడదు. భయంకరమైనవి వినకూడదు. బాధాకరమైనవి వినకూడదు. మధురమైనవి, భగవన్నామము, పరులక్షేమము, లోకక్షేమము సంబంధించినవి నీవు

srisathyasai vahinamrutam

వినాలి. నా భారతదేశమే సుఖంగా ఉండాలి సంతోషంగా ఉండాలి అని మనం ఆశించరాదు. లోకాస్సమస్తా సుఖినోభవంతు అందరు సుఖంగా ఉండాలి. అన్ని దేశములు సుఖంగా ఉండాలి. అందరు ప్రజలు సుఖంగా ఉండాలి. ఇంత విశాలమైన భావం చేసుకున్నప్పుడు నీకు, చెప్పకుండానే గౌరవమునందిస్తారు. నీవు గౌరవము కోరదలచిన నాడు మంచి మాటలతో నీ గౌరవాన్ని పెంచుకో. మంచి ప్రవర్తన చేతనే నడత చూపించు. తద్వారా నీకు తగిన స్థాయి అందిస్తారు. ప్రవర్తన సరిలేకుండా, మన మాటలు సరిలేకుండా, మన నడతలు సరిలేకుండా పోయినప్పుడు ఎవ్వరూ మనలను గౌరవించరు. మొట్టమొదట మనము గౌరవాన్ని మంచి నడతలలో సంపాయించు కోవాలి.

**మనిషికి మించినదేదీ లేదు**

విద్యార్థులారా! ఈనాడు మానవత్వము అంటే ఏమిటో అర్థము చేసుకోటానికి ప్రయత్నం చేయండి. మానవత్వములో నున్న దివ్యశక్తి ఎవరికీ గుర్తించటానికి వీలుకాదు. ఎన్ని శక్తులు ఉన్నాయో ఆ శక్తులన్నీ మానవునియందే యిమిడి ఉన్నాయి. నీవు మానవాకారము కాదు. విశ్వవిరాట స్వరూపుడవు నీవు. అన్ని రూపములు నీయందే ఉన్నాయి. అన్ని శక్తులు నీయందే ఉన్నాయి. అన్ని గుణములు నీయందే ఉంటున్నాయి. అన్ని భూతములు నీయందే ఉంటున్నాయి. కనుక అట్టి మానవత్వాన్ని ఎందుకు దుర్మార్గములో ప్రవేశపెట్టి తుచ్ఛముగా నీవు భావిస్తున్నావు. కాదు. ఉపనిషత్తులలో మానవుడు విలువైనవాడని ఒక పేరు. దీనికంటే మరొక విలువ లేదు. డైమండ్‌కి విలువ యిస్తున్నారు. ఎవరు యిస్తున్నారు డైమండ్‌కి విలువ? మానవుడే యిస్తున్నాడు. భూమికి విలువ యిస్తున్నారు. ఎవరు యిస్తున్నారు? మానవుడే యిస్తున్నాడు. బంగారమునకు విలువ ఎవరు యిస్తున్నారు. మానవుడే యిస్తున్నాడు. కాబట్టి బంగారు విలువ గొప్పది, డైమండ్ విలువ గొప్పది, భూమి విలువ గొప్పది అని వర్ణిస్తున్నాము. కాదు men are more valuable than all the wealth of the world. మనిషికంటే మించిన గొప్ప డైమండ్ మరొకటి లేదు. అలాంటి మానవత్వాన్ని ఎంత దుర్వినియోగం చేసుకుంటున్నాము మనం. ఆనాటి పవిత్రమైన ఋషులందరు యీ మానవత్వాన్ని ఎంత సార్థకం గావించుకున్నారు.



srisathyasaivachanamrutam

## ఆధ్యాత్మిక శక్తే నిజమైన శక్తి

విశ్వామిత్రుడు గొప్ప తపఃస్సంపన్నుడు. అనేక అస్త్ర శస్త్రములంతా సాధించినవాడు. కానీ కోపముచేత సర్వము తాను నాశనము చేసుకున్నాడు. భగవద్భక్తుడైన వశిష్ఠులవారిపై దండెత్తి పోయాడు. వారిని ఓడించాలని ప్రయత్నం చేశాడు. కానీ వశిష్ఠుడు ఎక్కడివాడు. ఎందుకోసం దశరథమహారాజు యింటిలో చేరాడు. ఒకానొక సమయంలో దశరథునితో మాట్లాడుతూ వశిష్ఠుల వారు చెబుతున్నారు. మహారాజా! మీరు గొప్ప మహారాజులు. ఆస్తిపాస్తులకు ఏమీ తక్కువ లేదు. కానీ నీ ఆస్తిపాస్తులను చూచి నేను రాలేదు. మీరు మహారాజులనే గొప్పతనంతో రాలేదు. నీ యొక్క శక్తిసామర్థ్యములు గొప్పవని భావించి నేను రాలేదు. నేను ఎందుకోసం వచ్చానో తెలుసునా? నీ యింటిలో శ్రీమన్నారాయణుడు పుట్టబోతున్నాడు. అతనితో కొంతకాలం గడపాలని వచ్చాను. అంత ప్రేమతో వున్నవారు వశిష్ఠులవారు. తనపైన విశ్వామిత్రుడు ఎలా క్రోధము పూనాడు? వశిష్ఠులవారికి బ్రహ్మఋషి అని పేరు వచ్చింది. నిరంతరం బ్రహ్మతత్వాన్ని చింతించేవాడు. కాబట్టి అతనికి బ్రహ్మఋషి అని పేరు వచ్చింది. విశ్వామిత్రుడు రజోగుణముతో ఉండేవాడు. కాబట్టి రాజసికంగా భావించారు. అతను బ్రహ్మఋషి యితను రాజర్షి. నేను కూడా బ్రహ్మర్షి కావాలని చాలా పట్టు పట్టాడు. తపస్సులు చేశాడు. ఎన్ని చేసినా ఆ కీర్తి ఒకరు యిస్తే పుచ్చుకునేది కాదు. పవిత్రమైనది మనలో ప్రవేశించాలి. కొనేది కాదు. లేక ఒకరితో బహుమతిగ తీసుకునేది కాదు. ఏ కంపెనీ సప్లై చేసేది కాదు. మన ప్రవర్తన చేత మనకు మంచి పేరు వస్తుంది. అలాంటి విశ్వామిత్రుడు వశిష్ఠుల వారిపై క్రోధము పూనటం చేత సర్వశక్తులూ కోల్పోయాడు. మీకు తెలుసు దూర్వాసుడు, అతను గొప్ప తపస్సంపన్నుడే. అతనికి క్రోధము ముక్కు పైననే ఉంటుంది. ప్రయోజనం ఏమిటి? మహర్షి. ఈ మహర్షి అయినందుకు ఏమి కావాలి? పవిత్రమైన, మధురమైన వాక్కులు కావాలి. పవిత్రమైన నడతలు ఉండాలి. అప్పుడే ఈ మహత్తరమైన శక్తికి గొప్ప కీర్తి వస్తుంది. మన ప్రాచీన భారతదేశమునంతయు అనేకమంది మహర్షుల చేత మహాత్ములచేతను, యోగులచేతను అభివృద్ధి పొందినది. ఇంతకాలము భారతదేశము అనేక అవస్థలకు గురైనప్పటికి, అనేక విదేశీయులు దండెత్తి వచ్చినప్పటికిని ఎవ్వరు ఏమీ కదిలించలేకపోయారు. కారణం

srisathyasaivachanamrutam

ఏమిటి? ఆధ్యాత్మిక శక్తి గాఢమైనదిగా ఉండటంచేత ఎవరు దీన్ని ముట్టలేకపోయారు. వందల సంవత్సరములు పాలన చేసినవారైనప్పటికిని భారతదేశము యొక్క పవిత్రత ఎవ్వరూ మార్చలేదు. కాబట్టి మహర్షులు వేసిన foundation యీ భారతదేశమునకు భద్రమైనది. ఆనాడు వేసిన foundation మనం కాపాడుకొనలేక దినదినమునకు శిధిలము చేసుకుంటూ వస్తున్నాం.

**మానవతా విలువలను పెంచుకోవాలి**

కనుక మొట్టమొదట మనం కాపాడుకోవలసింది ఏమిటి? మానవత్వము యొక్క విలువ మనం కాపాడుకోవాలి. మానవతా విలువలు మనం పెంచుకోవాలి. ఈ విలువలు లేకుండాపోతే మానవుడుగా పుట్టి ప్రయోజనం ఏమిటి? మానవతా విలువలు ఏమిటి? ప్రేమ, సత్యం, ధర్మము, అహింస, శాంతి. ఈ అయిదు మానవుని విలువలు. ఈ ఐదు విలువలు మనం కాపాడుకుంటే ఎవ్వరు మనలను కాపాడనక్కరలేదు. 'ధర్మోరక్షతి రక్షితః.' నీవు ధర్మాన్ని రక్షిస్తే ధర్మమే నిన్ను రక్షిస్తుంది. ధర్మాన్ని నీవు శిక్షిస్తే అది నిన్ను శిక్షిస్తుంది. కనుక ధర్మమే మనలను కాపాడేది. ప్రేమే మనకు రక్షగా ఉండేది. మన శాంతమే మన కిరీటంగా ఉండేది. మన అహింసయే హృదయంగా ఉండేది. మన హృదయము అహింసతో కూడినది. ఏవిధమైన కఠినమైన పలుకులు రాకూడదు. వస్తే అది హృదయమే కాదు. మన హృదయంనుండి మృధు మధురమైన పలుకులు రావాలి. పరులను ఆనందపరచే పలుకులు రావాలి. పరులను అసంతృప్తి పరచే పలుకులు రాకూడదు. ఈవిధంగా హృదయమున్న మానవుడు, బండ హృదయంగా మారిపోతున్నాడంటే ఎంత దురదృష్టం. మృగములు కూడా చేయని హింసలు మానవులు చేస్తున్నారు. మృగము కంటె హీనమైపోతున్నాడు మానవుడు. దయాదాక్షిణ్యమే లేకుండా పోతున్నది మానవునియందు. ప్రేమంటే ఎక్కడా విలువ కనిపించటం లేదు. మానవునకు ప్రేమ రెండవ హృదయము. ప్రేమయే మానవుని నిజమైన స్వరూపము. ఆ ప్రేమచేతనే మనం సర్వము సాధించాలి. దైవమంటే ఎక్కడో మనం వెతకనక్కరలేదు. ఏ సాధనలు చేయనక్కర లేదు. Love is God. Live in love. దీనిలో నీవు నివసించాలి. ప్రేమచేతనే ఆ ప్రేమను సాధించాలి. ఇంతకంటే వేరే శ్రమపడనక్కరలేదు. ఏ కష్టములు పడనక్కరలేదు. ఏ ధనము ఖర్చు పెట్టనక్కరలేదు.

sri sathyasaivachanamrutam

కాసు ఖర్చుకాకుండా కాలు గడపదాటకుండా కైవల్యం తక్కున వచ్చి ఒళ్లో పడుతుంది. దేనివల్ల? ప్రేమచేతనే. సర్వము ప్రేమచేతనే లభ్యమవుతుంది.

**ప్రేమను పెంచుకోవాలి**

ప్రేమస్వరూపులారా! ప్రేమను మీరు పెంచుకోండి. ఎటువంటి వారితో మనం ద్వేషం పెట్టుకోకూడదు. ఈ ద్వేషం చాలా ప్రమాదమైనది. ద్వేషము చేత ఏ పలుక్కైనా పలికితే అది నీ హృదయంలో నాటుకొనిపోతుంది. ఆ నాటుకొన్న దానిని తీయాలంటే ఎన్నో అస్త్ర శస్త్రములు కావాలి. ఆ ప్రేమతో పలికిన పలుకులు ప్రేమచేతనే రక్షించుకోవాలి. ఎవరు నిన్ను దుర్మార్గమైన మాటలు ఆడినారో వారిని నీవు ప్రేమించు. మనం అతనిని ప్రేమించేటప్పటికి అతని మనస్సే మారిపోతుంది. మనం ప్రేమించేకొలది అతను పెట్టిన బాధలు తగ్గిపోతుంటాయి. ఈ గాయమును మాన్పే మందులు ప్రపంచములో ఎక్కడా లేవు. సూటిమాటల చేత మన హృదయానికి నాటుకుపోయే అంబులు వేసినప్పుడు మనం ప్రేమమాటలచేత ఆ అంబుల బాధను తగ్గించుకోవాలి. అదే మందు ఇంత quick relief చేసే మందు మరొకచోట చిక్కదు. Quick relief, అది మన ప్రేమచేతనే ఎలాంటి జబ్బునైనా సరే భయంకరమైన జబ్బునైనా సరే. కానీ యీనాడు భయంకరమైన జబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి. యివన్నీ tension, psychological. ప్రతి మానవునికి ఏది లేకపోయినా tension. ఎందుకో యీ tension అర్థం కావటం లేదు. ఈ tension ఎక్కడ నుండి కొనుక్కుంటున్నారో అర్థం కావటం లేదు. ఎక్కడ చిక్కుతుందో నాకు చెబితే నేనూ కొనుక్కోవచ్చు. కానీ యీ tension ఎక్కడా చిక్కేది కాదు. తనను తానే సృష్టించుకుంటున్నాడు. ఈ tension మానవుని హతం చేస్తున్నాది. ఈ tension వల్ల temper వస్తున్నాది. Tension, temper రెండు చేరితే అధోగతి అయిపోతున్నాది. మనలో లేని దాన్ని మనం తెచ్చుకుంటున్నాం. మనలో ఉన్నదాన్ని పారపోస్తున్నాం. కప్పులో నీరుంది దీనిలో పాలు పొయ్యాలి. పాలు పోయాలంటే ఏమి చేయాలి. యీ నీరు పారపోయాలి తిరిగి పాలు వేసుకోవాలి. అదే రీతిగా నీలోని దుర్మార్గమైన భావాలు దూరము చేసుకోవాలి. సన్మార్గము, సత్ప్రవర్తన అనే ప్రేమ భావములు నింపుకోవాలి. ఒకటి empty చేయాలి. యింకోటి fill చేయాలి. Start the day with love, fill the day with love, spend the day



srisathyasaivacanamrutam

with love, end the day with love. This is the way to God. మనం ప్రేమతోనే start చేయాలి. ప్రేమతోనే మనం పవిత్రం కావాలి. ప్రేమతోనే end కావాలి. అన్నీ ప్రేమతోనే చేయాలి. ప్రేమ ఏమాత్రం తరిగేది కాదు. క్షణక్షణమునకు పెరిగేదే. ప్రేమ పెంచేకొద్దీ పెరుగుతుంది. ఎలా పెంచాలి. పదిమందికి ఈ ప్రేమ యిస్తూ పోవాలి. నీదగ్గర ఉన్నది పంచుకుంటూపోతే ఖాళీ అవుతుంది. మరి ప్రేమ నింపుకుంటూ పోవచ్చును. తరగనిది. అది అమృతమయమైనది. శాశ్వతమైన ప్రేమతత్వం. ప్రేమ అమృతం కంటె మరింత మధురంగా ఉంటుంది. నారదుడు అడిగాడు అమృతంకంటె మధురమైనది ఉన్నదా నారాయణా! ఓ పిచ్చివాడా! ప్రేమ అనింటికంటె చాలా మధురమైనది. అమృతం అనుకుంటున్నాము. అమృతమును త్రాగే కొలది విసుగుపుట్టవచ్చుగాని, కానీ ప్రేమ అనుభవించే కొలది అభివృద్ధి అవుతుంది. దానిలోని మాలిన్యాన్ని మనం తీసివేయాలి.

**మనలోని మాలిన్యాన్ని తీసివేయాలి**

ఒక పశువు ఎంత పనిచేస్తున్నది చెప్పండి. బిడ్డ పుట్టిన తక్షణమే ఆ బిడ్డకున్న మాలిన్యమునంతా నాకి వేస్తుంది. అది నాకిన తరువాత బిడ్డ లేస్తుంది. లేచిన బిడ్డను పాల దగ్గరకు తీసుకుంటుంది. పాలిచ్చేటప్పటికి పరుగెత్తటానికి ప్రయత్నిస్తుంది. చూశారా! పశువే అంత ప్రేమ చేత తన బిడ్డను కాపాడుతుంటే పశుపతి ఎందుకు కాపాడడు. అనగా ఏమి? వానిలోని దోషములంతా తీసివేయాలి. ఆ మాలిన్యము తుడిచివేయాలి. పవిత్రత పెంచాలి దివ్యత్వం చేర్చాలి. దైవత్వంగా జీవించాలి. ఈవిధమైన ప్రేమతత్వం మనం చక్కగా అర్థం చేసుకుంటూపోతే ఎంత వర్ణించినా భాష లేదు. ప్రేమకు భాష లేదు. అనిర్వచనీయం ప్రేమ అన్నాడు నారదుడు. వచనములో చెప్పటానికి వీలుకాదు. యిలాంటి ప్రేమతత్వాన్ని చాటినవాడు నారదుడు. నర, నారద, నారాయణ ఈ మూడింటి ఏకత్వాన్ని కూర్చినది దివ్యత్వం. కాబట్టి నరుని నారాయణుని ఏకం చేసినవాడు నారదుడు. నారదుడనగా కలహప్రియుడని అనుకుంటున్నాం. చాలా పొరపాటు. కలహప్రియుడే కాదు. పూర్వం ఉండేవాడు కలహప్రియుడు. తరువాత తపస్సు ఆచరించి తన దోషములు తాను గుర్తించుకుని, దోషములు పరిహారము గావించుకున్న తరువాత గొప్ప బోధకుడుగా తయారయ్యాడు. జ్ఞాన బోధకుడు నారదుడు. అజ్ఞాన నాశకుడు నారదుడు. దుఃఖనివృత్తి

srisathyasaivahini.org

ఆనందప్రాప్తి గావించిన వాడు నారదుడు. కనుక ప్రపంచములోనున్న సమస్త దుఃఖములు పరిహారము గావిస్తూ వచ్చాడు. వేదం చెప్పుతూ వచ్చింది.

**యల్లబ్ధ్వా పుమాన్ ఇచ్ఛారామో భవతి**
**తృప్తో భవతి మత్తో భవతి**
**ఆత్మారామో భవతి**

ఈవిధంగా ఆత్మారాముడే భగవంతుడని ప్రబోధ చేశాడు నారదుడు. ఉన్మత్తుని గావించినవాడు నారాయణుడే. అంతా ఆ మధురమైన ప్రేమలో ఉన్నాది. నీలో కించిత్ ప్రేమ పెట్టుకొని నా ప్రేమ గొప్పది నేను ప్రేమించాను అని అనుకుంటే అది ప్రేమ కానే కాదు. స్వార్థం స్వార్థం. ప్రేమ ఏ క్షణములో తరిగేది కాదు. ఎందరిని ప్రేమించినా అది పెరిగేదే. యిట్టి పెరిగే ప్రేమతత్వము మనయందుంచుకొని మనం ఎందుకింత బాధలకు గురికావటం? మనం ఎందుకింత అశాంతి పొందటం? ఎందుకిన్ని కష్టములు అనుభవించటం? కష్టములే లేవు మనకు విచారములే లేవు మనకు ఆనందమే ఆనందము.

**అనుసరించినప్పుడే ఆనందం లభ్యమౌతుంది**

ఎప్పుడు ఈ ఆనందము మనకు లభ్యమవుతుంది? దేనిని అనుసరించి నప్పుడు ఆనందము వస్తుంది. నేను ఒక పదార్థము యిస్తాను. ఆ పదార్థము పుచ్చుకొని భుజించినప్పుడే నీకు ఆకలి తీరుతుంది. నాయనా నీవు భుజించి ఆకలి తీర్చుకో అని పదార్థములు యిచ్చాను. కానీ యీనాడు మీరు ఏమి చేస్తున్నారు. తట్టలోని పదార్థముల పేర్లు చెబుతున్నారు. నోటితో చపాతి అని అంటున్నావు. ఈ నోటితో చపాతీ పేర్లు నూరు సార్లు చెప్పినా గానీ నీ పొట్ట నిండదు. కానీ తట్టలోని పదార్థము పొట్టలోకి చేరాలంటే నోటికి, చేతికి పని పెట్టాలి. చేత్తో అందుకోవాలి. నోటితో తినాలి. చేతితో మంచిపనులు చేయాలి. నోటితో మంచి మాటలు మాట్లాడాలి. ఈ రెండింటిద్వారానే మాధుర్యము కల్గుతుంది. ఆకలి తీరుతుంది. ఆనందము అందిస్తుంది. అమృతములో చేరుస్తుంది. మీరందరు అమృతస్వరూపులే. మీరందరు ఆనందస్వరూపులే. అందుకోసమే ఉపనిషత్తులు ఆనంద పిపాసి మానవుడు అన్నాయి. కారణం ఏమిటి? ఏ పనులు చేసినా నాకు యింకా ఆనందం కావాలి అంటున్నాడు. ఎంత ఆనందాన్ని అనుభవించినా తీరలేదు. ఏ పని చేసినా నాకు

sri sathyasai vacharamrutam

ఆనందం కావాలి. ఆనందంలోనించి పుట్టినవాడు. కనుక తన స్వస్థానం తాను ఆశిస్తున్నాడు. చేప జలములో పుట్టింది. జలములోని చేపను తీసుకునివచ్చి వజ్రవైఢూర్యగోమేధికపుష్యరాగములు అతికించిన బంగారు కప్పులో వేసిపెడితే దానికేమీ ఆనందం కలుగదు. వజ్రములుండవచ్చు, వైఢూర్యములుండవచ్చు, గోమేధికం ఉండవచ్చు. బంగారముండవచ్చు. జలము లేదేనని చాలా బాధ పడుతుంది. దాన్ని తీసుకుపోయి జలములో విడిచిపెట్టు ఆనందమును అనుభవిస్తుంది. అదేవిధముగా ఈనాటి మానవుడు ఆనందము నుండి ఉద్భవించినవాడు ఆనందమే తన స్వస్థానము. స్వస్థానము తాను చేరేంత వరకు ఆనందము కోసం అనేక విధములుగా పరితపిస్తున్నాడు. నిజంగా లోకంలో ఆనందమే ఉంటే ఎందుకీ పరితాపం. భగవద్గీత చెప్పింది. **"అనిత్యం అసుఖం లోకం".** యిది నిత్యమైనది కాదు. ఏదో మనం పొట్ట పోషించుకునే నిమిత్తమై జీవించే నిమిత్తమై యీ ప్రపంచములో వచ్చిపడ్డావు. జీవనోపాధి సంబంధమైన పనులు మనం చేయవచ్చు. నీ ఉద్యోగాలు నీవు చేయి. నీ వ్యాపారాలు నీవు చేయి. కానీ నీ మనస్సు దైవంపై ఉంచుకో. అప్పుడే నీకు శాంతి సుఖము లభిస్తుంది. ఎంత ఉండి ప్రయోజనం ఏమిటి. శాంతి ప్రపంచ పదార్థములలో లభించదు. దైవచింతలోనే లభిస్తుంది శాంతి. నిజంగా ఆ ఆనందము ఎవరికి తెలియదు. చెలగి మధువుగ్రోల చేదు రుచించునా. నిజంగా యీ ఆనందమే తిని ఉంటే ఈ ప్రపంచ విషయాలపైన మనసు ఎట్లా పోతుంది. మీరు దానిని అనుభవించలేదు కనుక దీని ఆనందము మీకు లభ్యము కావటం లేదు. కనుక మీరు ఈ ఆనందాన్ని అనుభవించండి. ఆనందమునకు మీరు ఎక్కడికో పోనక్కర లేదు. మీ హృదయము నిండా ఉన్నాది ఆనందము. నీవు ఆనందము నుండే ఉద్భవించావు. ఆనందమే నీ స్వస్థానము. ఆనందమే నీ జీవితము ఆనందమే నీ శ్వాస. ఆనందమే నీ హృదయము. ఇంతకంటె మించిన ఆనందము మరొకటి లేదు. అదియే భగవంతుని నుండి మనకు వచ్చింది. అన్నింటియందు జయత్వాన్ని పొందు. నీ దివ్యత్వాన్ని తెలుసుకో. Success be gets successes. నీవు ఎప్పుడు జయమునే పొందుతావు.

**(తేదీ 27-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini.org